**సంప్రదాయ వివాహంలో, వధూవరులంత ప్రాధాన్యతా వున్న తమాషా పాత్ర మరోటుంది. అది హాస్య పాత్రా, విషాద పాత్రా? ఆలోచించండి.**

**రాజా రఘుపతిరావుగారి కూతురి పెళ్ళి.**

**అక్కడా, ఇక్కడా కాదు హైదరాబాదులో.**

*హైద్రాబాదు, ఆయన సంస్థానానికి సుమారు ఓ వందమైళ్ళ దూరంవుండవచ్చు. ఆ ఊరి పేరుకూడాసంస్థానమే. అంటే ఆవూరికి పేరు లేదనికాదు, వుండవచ్చు. తహసిలు రికార్డులలో,ఎన్నికలరికార్డులలో,ఉండవచ్చు ఆ పేరు. ఆ వూరివారుఊరిపేరు ఎన్నడో మరచిపోయారు. కాదంటే ఎవరన్నా చదువు వచ్చినవారొస్తే రాజావారిదేవిడిలోనేవున్న ఓ మారుమూల గదిముందు వ్రేలాడుతున్న గ్రామపంచాయితి కార్యాలయం బోర్డుపైనా, లేదా అదే గ్రామానికి మరో చివరనున్న మరో పాడుబడ్డ ఇంటిముందు వ్రేలాడుతున్న పాఠశాలబోర్డుపైనా, ఆ గ్రామం పేరు చదువుకోవచ్చు.*

# పురోహితుడు

## నవకోటి నరసింహారావు

అదయినా చిన్నక్షరాలుచదవగలిగితేనే. అందుకని ఆ వూరి పేరు సంస్థానమనే అంటారు. ఊరి పేరుతో మనకేం పని మనకు కావలిసింది దొరవారు.

మొత్తం సస్థానం కదిలి వెళ్లాలిసిందే హైద్రాబాదుకు. వారికి పెళ్ళి చూడటం అంత ముఖ్యం కాకపోవచ్చు కాని, పదో. పాతికో కట్నం చదివించటం మాత్రం అతి ముఖ్యం. అందులో ఎలాంటి పొరపాటు జరగడానికి వీలులేదు. కట్నం చదివించిన వారిపేర్లు గుమాస్తాచే నమోదు చేయబడతాయి. ఎప్పుడో తీరిక దొరికినప్పుడు ఆ నమోదు పత్రం దొరవారితో పరిశీలింపబడుతుంది. అందులో ముఖ్యంగా కట్నం చదివించిన వారిపేర్లకన్నా చదివించని వారిపేర్లు బాగా గుర్తుపెట్టుకుంటాడు. అలా గుర్తింపబడినవారి (సం)గతి తర్వాత విచారించబడుతుందనుకోండి, అది వేరే విషయం.

అందరికి వలెనే ఆ వూరి పురోహితుడుగారు కూడా హైద్రాబాదుకు పయన మవుతున్నారు. అతనికి కట్నం చదివించే అవసరం వుండదుకాని తను లేకపోతే పెళ్ళెట్లా అవుతుంది. అందుకని పెళ్ళిలో అతని ఉపస్థితి అవసరం. అలాని అతనికి ఆహ్వానం అందిందా అంటే అదీ లేదు. ఆహ్వానం లేకున్నా తను వెళ్ళాలి. అది అతని బాధ్యత. ఒక చిరు సంచిలో ఒక ధోవతి, ఒక పంచె, తమలపాకుల పెట్టె. కప్పుకోవడానికి ఒక శాలువా పెట్టుకున్నాడు.

"ఓ పది రూపాయలుంటే ఇస్తావూ" అని భార్య నడిగాడు. భార్య సోమిదేవమ్మ "దొరవారి లారీలు వెళ్తున్నాయి కదా! అందులోనే పోయి అందులోనే తిరిగి రావచ్చుకదా! ఎందుకూ పది రూపాయలు" అంది.

ఈ లారీల బెడదకన్నా హాయిగా బస్సులో వెళ్ళి బస్సులో రావాలనుకున్నాడు.

"ఎట్లయినా దొరవారింట్లో పెళ్ళి. పెద్ద సంభావనే ముడుతుంది. అందునా వెళ్ళేది పట్నమేనాయె. "వస్తూ నాకొకచీర కొనుక్కురండి" అంది ఆ ఇల్లాలు కార్యకారణ సంభవాలన్నీ చెబుతూ.

"నాయనా! ఈ ఊళ్ళ మూడో తర్గతి సాంగిక శాస్త్రము దొరుకుతలేదు పట్నంల కొనుక్కురా" ఇది సుపుత్రుడి ఆజ్ఞ

"నాకు ఎర్ర రిబ్బన్లు కొనుక్కురావే" చిన్నారి కూతురు కోరిక.

పెద్ద కూతురు నీళ్ల పోసుకొని పుట్టింటికి వచ్చింది. ఆరోమాసం'ట' అడుగుదామావద్దా అనుకొనే, సంశయిస్తూనే అడిగింది. పట్నంలో పెద్ద దానిమ్మకాయలు దొరుకుతయట అవి కావాలని.

సరే, అని కోరికలన్నీ మూటకట్టుకొని బయలుదేరాడు. దేవిడివైపు నడిచాడు. దేవిడి ప్రాంగణం అత్యంత కోలాహలంగా వుంది. లారీలో సామాన్లు నింపుతున్నారు. పెద్ద పెద్ద వంటబిందెలు. పప్పుడికించే గుండిగలు. కూరలు చేసే కళాయిగిన్నెలు. ఇంకా చాందినీలు, పెద్ద జంపుఖానాలు, తివాచీలు వగైరా వగైరాలతో గుమాస్తా నారాయణ సామాన్ల లిస్టు వేసుకుంటున్నాడు.

పురోహితుడు నారాయణ దగ్గరకు వెళ్ళి పలుకరించాడు. నారాయణ పురోహితుని వైపు ఒకసారి చూసి, మళ్ళీ తన పనిలో నిమగ్నమయ్యాడు. ఒకవేళ పురోహితుడ్ని పలుకరిస్తే తన కార్యదీక్షకు భంగం వాటిల్లదూ.

"ఏమయ్యా నారాయణ సేటూ ఈ లారీలో కాస్త చోటు దొరుకుతుందా?" అనడిగాడు.

"కొంచె ముండవయ్యా పంతులూ. కొంచె మిక్కడ లెక్కతప్తే నా తలకాయ పోతది. ఇదయినాంక కల్వు" అన్నాడు.

పురోహితుడికి అర్థంకాలేదు. ఇదయినాక అంటే సామాన్లు నింపడం అయినాకనా లేక లారీ వెళ్ళిపోయినాకనా? లారీ వెళ్ళినాకయితే కలవడం దేనికి?

దూరాన మరో లారీ నిలబడి వుంది. దాని దగ్గరకు వెళ్ళాడు. అందులో జనం కిట కిటలాడుతున్నారు. అందరు నిలబడే ఉన్నారు. ముందర క్యాబిన్ దగ్గరకు నడిచాడు. ముందర డ్రైవరు ప్రక్కసీట్లో గ్రామ కరణమూ, పోలీసు పటేలు, మాలీ పటేలు కూర్చుని ఉన్నారు. వారు గ్రామ ప్రముఖులు కదా!"

"అయ్యో పంతులూ మీరెట్ల వస్తరు. దీంట్ల జాగలేదుగద వెనుక కెక్కరాదుర్రని అన్నాడు కరణం"

"వెనుకకు ఎక్కరాదండీ పెద్దవాన్ని



అందునా జనం బాగా వున్నారు" అన్నాడు.

"ఎట్లనన్న తిప్పలుపడిర్రని. మీర్రాక పోతే శానా కష్టమయితది. పోలీసు పటేలు హుకుం జారీచేశాడు.

"రాకుంటే జేత్తడు" మాలీపటేలు ధీమా. పురోహితుడు వెనుకవైపు చూశాడు. అందులో హరిజనులు మినహా అన్ని కులాల వారూ ఉన్నారు? అంటే అందరూ అని కాదు. అన్ని కులాల ప్రతినిధులని అర్థం. అందులో సగంమంది పనివాల్లున్నారు. సుంకర్లూ, నీరడీలు, చాకల్లూ ఎంత విద్యుచ్ఛక్తి దీపాలు దేదీప్యమానంగా వెలుగుతున్నా రాజ లాంఛనంగా దివిటీలు వెలిగించక తప్పదు. అందువల్ల మంగళ్ళూ ఉన్నారు. పురోహితుడు లారీ ఎక్కాలనో, చూతామనో లారీ సమీపించాడు. అంతే లారీలో జనం ఒక్కసారే గొల్లుమన్నారు. ఇందులో స్థలం లేదని. ముక్తకంఠం, ఏకగ్రీవం అని ఎన్ని పర్యాయ పదాలు వాడినా సరిపోదు. జనమంతా ఐకమత్యాన్ని సాధించారని చెప్పాలంటే దీన్నొక ఉదాహరణకు తీసుకోవచ్చు

ఇందులో ఎక్క వీలులేదు. అందువల్ల మళ్ళీ నారాయణ దగ్గరకు వెళ్ళాడు సామానెక్కించిన లారీ వెళ్ళిపోయింది. నారాయణకు పురోహితుడు ఇప్పుడు కనపడ్డాడు.

"అయ్యో పంతులూ నువ్ పోనేలేదా?" అన్నాడు ఇప్పుడే కొత్తగా చూస్తున్నట్టు.

"నీవు తర్వాత కలువుమంటివి. అందుకని ఆ లారీ దగ్గరకు వెళ్ళవచ్చా" అన్నాడు.

"అయ్యో ఆడికెందుకుపోయినవ్. నిన్నీ లారీల్నే యెక్కిత్తుగద. ఎట్లనయ్యా. అన్నిటిక నేనే సావాలె. బాపనాయ్న రాకున్నానన్నే తిత్తడుదొర. నువులేకుంటే లగ్గమెట్లయితదనుకున్నవ్" అన్నాడు నారాయణ.

మనుష్యులెక్కిన లారీకూడా వెళ్ళిపోయింది. రెండు మైళ్లు నడిచి వెళితేకాని బస్సుస్టాండు లేదు. ఇప్పుడు నడిచివెళ్ళినా బస్సందదు.

నారాయణకు తెలుసు, రాత్రికి మరో లారీ వెల్తుందని. కాని పురోహితునికి చెప్పడు. చెబితే అతనికి లోకువైపోడూ. తెలియనంతసేపూ తనచుట్టు తిరుగుతాడు. ఎంతయినా తను దొరదగ్గర గుమాస్తానాయె. ఈ మాత్రం తెలివితేటలులేకపోతే ఇలా ఇంతకాలం నెగ్గుకు వచ్చేవాడే కాదు.

పురోహితుడికి ఒక ఆలోచన తట్టింది.

"ఇంతకూ నారాయణా నీవు పెళ్ళికి వెళ్ళడం లేదా?" అమాయకంగా అడిగాడు.

"అయ్యోరామా నేనో్పకపోతే అక్కడ ఇంతేజాం అన్నీ ఎవరు చూ_త్తరు. ఇక్కన్నించి సామాన్లన్ని పంపాలె, మళ్ళక్కడ వన్ని చూసుకోవాలె, వంటలకు సామానియ్యాలె. ఏవ్వాళ్ళకు ఏది కావాల్నా అది చూసుకోవాలె."

"మరి నీవెట్లా వెళతావ్."

"ఎండ్లనన్న బడిపోత."

"సరే నీతోనే నేను" అన్నాడు ధీమాగా పురోహితుడు. నారాయణ ముఖం చిన్న బుచ్చుకున్నాడు.

చీకటి పడేవేళకు మరో లారీ వచ్చింది. "ఈ లారీ కూడా పట్నం వెల్తుందికదా" అడిగాడు పురోహితుడు. నారాయణ జవాబియ్యలేదు.

"ఏయ్ మస్తాన్ ఆ పిల్లల్ని జాగ్రత్తగా ఎక్కించుర్రని" అని ఆజ్ఞాపించాడు నారాయణ. ఏం పిల్లలో మొదట అర్థంకాలేదు పురోహితుడికి. అక్కడ మిగిలివున్న పనివాళ్ళు ఒక్కొక్క పిల్లనే ఎక్కిస్తున్నారు. అవి గొర్రెపిల్లలు. ఒకటి రెండు మూడూ.... లెక్కపెడ్తున్నాడు నారాయణ అయ్యో ఇదేంది మస్తాన్ ముప్పయే వున్నయ్. గొల్లోండ్లను నలుపై పిల్లలని యిమంటిమిగద" అన్నాడు.

"జీవాలు శాన లేవట. గివే యిచ్చిర్రను" మస్తాన్ జవాబు.

"గాడ్దికొడుకులకు మస్తీ ఎక్కింది. మల్లొచ్చినాంక వాల్లపని చెప్తా. అయితాయెగని కోడిపిల్లలు బుట్టలు. గుడ్ల బుట్టలు పెట్టుర్రని. పనివాల్లు బుట్టల నెక్కిస్తున్నారు.

"ఇంటికో కోడి లెక్కన తెచ్చిర్రా లేకపోతే ఇండ్ల గూడా...." "అందరిచ్చిన్రు బాంచెను" అన్నాడు అక్కడున్న హరిజనుడు.

ఇవన్నీ ఊరకే వచ్చినవి. దొరకిచ్చిన నజరానా.

"సరే! ఇగ పోదాం మస్తాన్"అన్నాడు నారాయణ. మస్తానూ, నారాయణ మరో పూరి పెద్దకాపూ ముందర కూర్చున్నారు. పురోహితుడు నోరు తెరిచాడు. లారీలో వెనుక కూర్చుంటే పూరి పెద్ద కాపు కు నామోషి. అందునా పూరి కాపుల తరపు ప్రతినిధిగా వేయినూట పదహార్లు కట్నం చదివిస్తున్నాడాయె. వెనకెలా కూర్చుంటాడు? వడితిరిగిన మీసా లున్నందుకైనా మస్తాన్ ముందు కూర్చోవలసిందే. దానికి తిరుగులేదు. ఇక నారాయణ సరే సరి- ఆయన సంగతి చెప్పనక్కరలేదు.

"నా సీట్ల కూసుంటావ్ పంతులూ" జోకు విసిరాడు డ్రైవరు- ముగ్గురూ గొల్లు మన్నారు.

## మిమిక్రీ మిత్రులు



### పి. జయశంకర్

పి. జయశంకర్ గుంటూరువాస్తవ్యులు. ఎం. ఏ. వరకు చదివారు. ప్రస్తుతం శాంతా కాలేజిలో పనిచేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ లోషుమారు 400పైగా ప్రదర్శన లిచ్చారు. మిమిక్రీలో గల అన్ని భాగాలలోనూ ప్రవేశం వుంది. ముఖ్యంగా సినీ ప్లేబాక్ గాయకులను అనుకరించడంలో (హిందీవారిని) సిద్ధహస్తులు. ఆంధ్ర ప్రదేశ్ మిమిక్రీ డెవలప్ మెంటు కమిటీ, గుంటూరు సంఘానికి అధ్యక్షులు. మిమిక్రీ కళను అభివృద్ధి పరచడం, తోటి మిమిక్రీ కళాకారులకు సహాయపడడం, జాతీయ స్థాయిలో మిమిక్రీని అభివృద్ధి చేయడం వీరి ఆకాంక్ష. పెయింటింగ్, డ్రాయింగులో కూడా నిపుణులు. మంచి రచయిత. Eleven stars cricket club గుంటూరుకు అధ్యక్షులు. వీరు మిమిక్రీ కళకు ఒక స్థాయి చేకూరుస్తారని ఆశిద్దాం.

పరిచయకర్త :

— నేరెళ్ళ లక్ష్మణరావు

ఎటుచెడీ ఏ హోదా లేనివాడూ, ఏ అధికారమూ లేనివాడూ, పెళ్ళిలో అతి ముఖ్యమైన పాత్ర వహించేవాడూ అయిన పురోహితుడు కష్టపడి ఎక్కి వెనుకకు కూర్చున్నాడు. తలొంచుకున్న గొఱ్ఱెల మధ్య ప్రాణమున్న కోళ్ళవలె, గ్రుడ్ల వలె ప్రాణంలేనట్టుగా కూర్చున్నాడు.

లారీ పట్నం చేరింది. దొరగారి భవనం సందడిగా ఉంది. అతిథులతో పెళ్ళిపందిరి (షా మి యా నా) కిటకిటలాడుతున్నది. రంగు రంగుల విద్యుద్దీప తోరణాలతో వివిధ కాంతుల వెదజల్లుతున్నవి. ఎటు చూసినా దీపాలే, బంగ్లా మొత్తం దీపాలే. పెద్ద పెద్ద వృక్షాలనిండా దీపాలే. చిన్న చిన్న పూల పొదలనిండా దీపాలే. క్రిందకి దిగివచ్చిన ఆకాశంలా ఉంది పురోహితునికి లారీ దిగుతూనే.

గేటుదాటి లోపల షామియానాలోకి అడుగుపెట్టాడు. ఒక ఊరంత పెద్దగా ఉంది. దాన్నిండా కుర్చీలు, సోఫాలు. వాటి క్రింద జంపుఖానాలు, తివాచీలు, షామియానా నిండా ట్యూబ్ లైట్ల వెలుగుతో రాత్రికి, పగలుకు అభేదంగా ఉంది. అది చలికాలమైనా అక్కడక్కడ నిలువెత్తు ఫ్యానులున్నాయి. అవి హోదా కోసం.

ఆడవారి కోసం ప్రత్యేకమైన షామియానా వేశారు. అన్నీ పట్టుచీరలే! అన్నీ నగలే! అంతా బంగారమే. అసలు మనుషులే కనబడటంలేదు. మే(ను)కప్పు వేసిన కొన్నంగుళాల ముఖాలు మాత్రమే మెరుస్తున్నాయి ట్యూబ్ లైట్ల కాంతిలో.

ఇవన్నీ చూస్తూ ఒకసారి దొరవారి దర్శనం చేసుకోవాలనుకున్నాడు పురోహితుడు. అల వైకుంఠపురములో, నగరిలో ఏ మూలనున్నారో ఏమో దొరవారు.

మేడమెట్లు ఎక్కాడు. లోపలి ఒక పెద్ద హాలులో సుఖాసనావిష్టులై వున్నారు దొరవారు. ఎవరితోనో ఏవో మంతనాలు జరుపుతున్నాడు. దొర పురోహితున్ని చూశాడు, కాని చూడకూడదు. అది రాజ లాంఛనము కాదు. పలకరించకూడదు. పురోహితునికి దొరను ఎట్లా పలుకరించాలో తెలియదు. అందరిపలె "దండాలు దొరా" అని అనలేడు కదా! అదే భట్రాజన్నా అయివుంటే రాయల వంశాభి చంద్రా అంటూ తన వునికిని తెలియజేసుకునేవాడు. పురోహితుని అదృష్టవశాత్తు యెవరో అడిగారు "ముహూర్తం యెప్పుడని." పురోహితుడు ఈ అవకాశాన్ని జారవిడుచుకో దలచలేదు. వెంటనే "పన్నెండు గంటల ముప్పయి ఏడు నిమిషాలకు" అన్నాడు. దొర అప్పుడు చూశాడు పురోహితున్ని. ఇప్పుడు నిజంగా చూశాడన్న మాట. ఇదివరకు చూసినది చూపుకాదు. "ఆఁ- వచ్చినవా పంతులూ. మూర్తం కరెక్టుటైంకు జరగాలె లగ్నం. ఒక మినట్

అటీటు కావొద్దు" అన్నాడు దొర. అంతే అంతకన్న యెక్కువ మాట్లాడి తన విలువైన మాటలనూ, కాలాన్ని వృథా చేయదల్చుకోలేదు. ఆ 'రంగం'లో తన పాత్ర అంతే ఉన్నందున పురోహితుడు బయటకు నిష్క్రమించాడు. దొర తన విలువైన మంతనాల్లో పడ్డారు మళ్ళీ.

ఆ భవనానికి ఇదివరకు చాలాసార్లు వచ్చాడు. తను లారీలో కోళ్ళు గొర్రెల మధ్య కూర్చొని రావడంవల్ల తన శరీరం వాసన పట్టినట్టనిపించింది. స్నానం చేయాలనుకున్నాడు. ఆ భవనంలో రెండుమూడు స్నానాల గదులున్నాయి. అన్నిట్లోనూ సందడే. ఒకోగదిలో స్త్రీలు తమ ముఖారవిందములను సబ్బులతో అరగదీస్తుంటే, మరో గదిలో పురుషులు తమ కరచరణములు తోమి పెడ్తున్నారు. మరోచోట పనిమనుషులు వారి వారి కర్తవ్యాలను నెరవేర్చుకుంటున్నారు.

ఇక ఇక్కడ లాభం లేదనుకొని, ప్రక్కనే వున్న తోటలో దిగుడు బావికి వెళ్ళాడు. సందడిగా లేదు, కాని చీకటిగా వుంది. తనకిదివరకే తెలిసివున్న బావి కనుక మసక వెలుగులో దిగి చక్కగా స్నానం చేశాడు. శరీరం తేలికయినట్టనిపించింది.

ముహూర్తం సమీపిస్తుంటే సందడి ఎక్కువ కాసాగింది. కార్లలో పెద్ద పెద్ద ఆఫీసర్లూ, మినిష్టర్లూ, ఎంయల్యేలు, యంపీలు వస్తున్నారు. అందరూ రాజావారితో కరచాలనం చేస్తూ తమ తమ ఆసనాల్లో ఆసీనులవుతున్నారు. బాండుమేళం మ్రోత వినిపించిందంతలో.

బాండుమేళంకన్నా మేళగాళ్ళ వేషాలు బాగున్నాయి. అలాంటి వేషాలు లేకుంటే ఆ బాండుకే విలువలేదు. ఆ విలువైన బాండు లేకుంటే ఆ పెళ్ళికే విలువ రాదు. ఆ పెళ్ళి విలువ ఎంతో తెలియనిది దొరవారి విలువ ఎంతో తెలిసిరాదు.

బాండుమేళం ఏ పాట వాయిస్తున్నారనేది అక్కడ కూర్చున్న వారి కెవరికీ అవసరంలేదు. పెళ్ళన్నాక బాండుండవలె. దాని ఘోష వినబడవలె- అంతే.

"టాంటడాం. టంటడాం రాజువెడలె రథసకు" బాండు వాయిస్తున్నారు. పెళ్ళిపిల్లవాడు తరలి వస్తున్నాడనే దానికి చిహ్నం. పెళ్ళి కుమారుడు వచ్చి వివాహవేదిక నలంకరించాడు.

అంతకుముందే స్థానిక సినిమా స్టూడియో సెట్ టెక్నిషియన్స్ వచ్చి ప్రత్యేకించి వివాహ వేదిక నలంకరించారు. లేదా వివాహ మంటపం సెట్ వేశారని కూడా చెప్పుకోవచ్చు.


రంజాన్ పండుగ సందర్భములో గ్వాలియరుమిల్లువారి డార్క్నప్యాభ్. సిల్వర్‌టచ్, టెరివూలు సూటింగ్స్ మరియు T. T. F. షర్టింగులు, సరికొత్త డిజైన్లలో స్టాకు వచ్చివున్నది. నేడేఖరీదుచేసి బిల్లుఅమౌంటుపై నిర్ణయించిన బహుమతులు పొందండి.

గ్వాలియర్ షూటింగ్స్ షోరూం

"శ్రీలక్ష్మి", (A C.) కొత్తగూడెం.




బాధ నివారణ కోసం
అయొడెక్స్
రుద్దటం అవసరం

ఇతర ఆయింట్‌మెంట్స్ మీకు బాధనుంచి ఉపశాంతిని ఇయ్యవచ్చు. అయొడెక్స్ ఉపశాంతిని ఇస్తూ, బాధను నివారిస్తుంది. దీనిలో అయొడిన్ ఉంది గనక.


కండరాల నొప్పులకూ, కీళ్ళ నొప్పులకూ ఒకే ఒక ఆయింట్‌మెంట్-అయొడెక్స్.






అయొడెక్స్-మిమ్మల్ని మళ్ళీ చురుకుగా పనిచేసేలా చేస్తుంది.

లింటాస్-IODEX.2-75 TL




పురోహితుడు మంత్రాలు చదువుతున్నాడు. ఇతనికి పెళ్ళి కుమారుని తరపు నుంచి వచ్చిన మరో పురోహితుడు తోడయ్యాడు. వాళ్ళిద్దరూ మంత్రాలు చదువకుండా బండబూతులు తిట్టుకుంటున్నా ఎవరూ పట్టించుకునేవారుకాదు. వేదోక్తంగానే మంత్రాలు చదువుతున్నారు. కాని ఎవరూ వినడంలేదు. వినరావడంలేదు. మగవారి రాజకీయాలూ, ఎన్నికలూ, ఈ మధ్య జరిగిన దోపిడీల గురించిన మాటల్లోనూ, ఆడవారి ఒకరి నొకరి చీరల పరామర్శల్లోనూ, సినిమాల గురించి, ఫ్యాషన్ల గూర్చి, వారి వారి భర్తల హోదాల గూర్చీ చెప్పుకుంటున్న మాటల్లోనూ, బాండువాల్లు వాయిస్తున్న వాయిద్య ఘోషలోనూ ఈ పురోహితుల మంత్రాలు వినరావడం అసహజం.

అకస్మాత్తుగా బ్యాండువారు ట్యూన్ మార్చారు. సర్కసులో పెద్ద మదగజాన్ని ప్రవేశపెట్టినప్పుడు వాయించే మ్యూజిక్ అది. పురోహితుడు వెనుకకు చూశాడు. అమ్మాయిని తీసుకురమ్మంటే ఏనుగు పిల్లను తెస్తున్నారేమిటని అరక్షణం మాత్రమే విస్తుపోయాడు. కాదు తనే పొరపడ్డాడు. ఏనుగు పిల్లకాదు. పెళ్ళి కూతురే. ఆ అమ్మాయి కట్టుకున్న - మొత్తం జరీతో నేయబడిన పట్టుచీరెను చూసి ఏనుగుపై వేసిన అంబారీ అనుకోడం తప్పు అని నాలుక కరుచుకున్నాడు. ఆమె ధరించిన నగలు చూచి ఏనుగు ముందర వేసే ప్రభ అనుకోవడం పొరపాటు అని ఎవరూ చూడకుండా తలగోక్కున్నాడు ఫెళ్ళున పెళ్ళయిపోయింది.

హైద్రాబాదు లోకల్ అతిధులు అభినందనలు తెలుపుతూ యిళ్ళకు వెళ్ళిపోయారు.

సంస్థానంనుంచి వచ్చినవారూ, బంధువర్గమూ, కొంతమంది యెస్టేటు మేనేజరు దగ్గరా, మరికొంతమంది నారాయణ దగ్గరా కట్నాలు చదివించి వాళ్ళపేర్లు నమోదు చేయించుకుంటున్నారు.

ఛళ్ళున తెల్లవారింది.

చాయెలు, కాఫీలు, ఉప్మాలు సప్లయి అవుతున్నాయి. ముఖాలు కడుక్కునేవారికి అన్నిరకాల టూత్ పౌడర్లూ, అన్ని బ్రాండుల టూత్‌పేస్టులూ సప్లయి చేయబడ్డాయి. రకరకాల సబ్బులుకూడా అక్కడ ఉన్నాయి. ఎందులోనూ ఏ లోపమూ రాకూడదు మరి.

పురోహితుడికి దొరసాని దర్శనం చేసుకునే వీలు అప్పుడు కలిగింది.

"రాత్రి కనపడకనే పోతివి పంతులూ. రాత్రి ఏమన్నా తిన్నవా లేకుంటే వుపోశమే వున్నవా" అని పరామర్శించింది.

"లేదండీ రాత్రి లగ్నం హడావుడిలో తినడానికి వీలు పడలేదు" అన్నాడు.

"ఐనా మీ బ్రాహ్మలకు అలవాటే కద ఉపోశముండుటం" అని తన చమత్కారానికి నవ్వి నారాయణతో చెప్పి సాయిత్యం యిచ్చే యేర్పాటు చేయించింది.

దొరసాని చెప్పంగనే బ్రాహ్మలకు సాయిత్యం యిప్పిస్తే తను తీరిక లేకుండా పని చేస్తున్నట్లు యెట్లా తెలుస్తుంది? అందుకని నారాయణ ఒకసారి బయటికి, మరోసారి భవనంలోకి, మళ్ళీ పందిట్లోకి వూరకనే వెళ్ళివచ్చి "అన్నిటికీ నే నొక్కన్నే ఛస్తున్న." అంటూ ఇద్దరు బ్రాహ్మలకు బియ్యమూ, పప్పూ, రెండు మూడు వంకాయలూ మిగతా వంట సామాగ్రి కాస్త నెయ్యి. మరికొంచెం శక్కరి ఇప్పించాడు. విసుక్కుంటూ, వెతికినట్లు నటిస్తూ రెండువంటపాత్రలుకూడా ఇచ్చాడు

ఎక్కడ వంట చేసుకోవటం. వంట పందిట్లో జరుగవలసిన మారణ హోమం రాత్రే జరిగినట్టుంది. వాటిని వంటవాళ్ళు వాళ్ల పాక నైపుణ్యంతో తీర్చి దిద్దుతున్నారు.

ఎక్కడో ఏ సందడీ లేని, ఏ వాసనా రాని ఓ మారు మూల ప్రదేశంలో వంట చేసుకొని భోంచేసి వచ్చారు.

పన్నెండు గంటలయింది. షామియానాలో అతిధులకు విందు యేర్పాటు చేయబడింది. ఆ యేర్పాటు పురోహితునికి వింతగొల్పింది. అక్కడ ఒక పెద్ద టేబిలు వేశారు. దానిపై రకరకాలపాత్రల్లో వివిధ రకాల ఖాద్య పదార్థాలు వున్నాయి. ఒక్కొక పాత్ర కెదురుగా వొక్కొక్క బట్లరు వున్నాడు. ఎర్ర చారల తెల్లని బట్టలు వేసుకొని ఓ గజం పొడువు టోపీలు పెట్టుకొని ఉన్నారు. ప్రక్కనే కొన్ని ప్లేట్లు బోర్లించబడి ఉన్నాయి. అతిథులంతా ఒక్కొక్క ప్లేటు తీసుకొని ఒక్కొక్క బట్లరు దగ్గరకు వెళితే ఆ చిప్పల్లో (సారీ ప్లేటుల్లో) ఒకడు అన్నం వేస్తుంటే ఒకడు చికెనూ, ఒకడు మాంసమూ ఇలా వేస్తుంటే, అడుక్కొని తెచ్చుకొని నిలబడి తింటున్నారు.

నాగరికత మూర్తీభవించిన ఆ నవీన పద్ధతి, సనాతనబ్రాహ్మణునికేం తెలుస్తుంది?

మొత్తంమీద కార్యక్రమమంతా అయిపోయినట్లే. పురోహితుని అవసరంకూడా తీరింది. కష్టపడి దొరగారి దర్శనం చేసుకున్నాడు. దొరగారు వచ్చిన అతి సన్నిహితులైన అతిథులతో కొలువు తీరి వున్నారు. వివాహం ఎంత గ్రాండుగా జరిగిందో కొందరు వివరిస్తుంటే వంట లెంత బ్రహ్మాండంగా ఉన్నాయో మరి కొందరు కొనియాడుతున్నారు, రాజుగారు మాత్రం తల వూపుతున్నారు.

అదే సమయంలో ఎస్టేటు మేనేజరు వచ్చి బాండువాళ్ళకు ఎన్నివేలిచ్చిందీ, కరెంటువాళ్ళు ఎంత తీసుకున్నదీ, వంటవాళ్ళకు ఎంత ముట్టిందీ, షామియానావాళ్ళు ఎంత బిల్లు చేసిందీ వివరించి చెబుతున్నాడు. అన్నీ వేలలోనే లెక్క. దొరగారు తన వైభవానికి మందహాసం చేస్తున్నారు.

ఇలాంటి సమయాల్లోనే వచ్చినందుకు పురోహితునికి సంతోషం కలిగింది. తనకు యెంత గొప్పగా సంభావన ముడుతుందో నని.

"దొరవారూ యిక నేను సెలవు తీసుకుంటాను" అన్నాడు వినయంగా పురోహితుడు.

"సరే మంచిది" అన్నాడు. దొర

యిలాంటి విషయాల్లో మితభాషి. పురోహితుడు బయటకు వెళ్ళలేదు. తన సంభావన సంగతి తేల్చరేం?ఎస్టేటు మేనేజరుకు కూడా ఏం తోచలేదు. పురోహితుని పునికిని తెలియజేయాలని "ఇంకేమి పంతులూ యింకా నిలబడ్డావు" అన్నాడు.

"దొరవారు ఆజ్ఞయిస్తే" అని నసిగాడు. డబ్బు యివ్వమని దొరవారిని అడుగకూడదు. వెంటనే దొర ఆజ్ఞ యిచ్చాడింటే పురోహితుని నోట్లో గడ్డే. అందువల్ల దొర ఆజ్ఞ యివ్వకముందే మేనేజరే కల్పించుకొని "ఏం, సంభావనా" అనడిగాడు.

"చిత్తం" అని అనీ అననట్టుగా అన్నాడు

దొరవారి పెదవులపై గుబురు మీసాల చాటున చిన్న మందహాసం మెరిసింది. ఆ మందహాసాన్ని చూసి తనకు లాటరీలో లక్షరూపాయలు వచ్చినంత సంతోషం కలిగింది పురోహితుడికి. కాని ఆ మందహాసంలోని అర్థం. మేనేజరు మాత్రమే చదువగలిగాడు. నా సంస్థానంలో బ్రతికేవాడివి. నీకుకూడా పారితోషకమా ? అని. ఇది శుభకార్యం కాకుండాఉంటే ఈ సంఘటనకు పురోహితుడు దొరగారి ఆగ్రహానికి గురిఅయ్యేవాడే. కాని కాలేదు. ఎంతయినా దొరగారు దయార్ద్ర హృదయుడు. ఎవరినీ నొప్పించడు. అడిగినవారికి లేదని చెప్పడం తన దొరతనానికి లోపం.

"మేనేజర్" పిలిచాడు దొర. మేనేజరు దొర ఆజ్ఞకు ఎదురు చూడసాగాడు నూరు రూపాయిలా నూరు కొరడా దెబ్బలా అన్నట్టు,

"ఓ పది రూపాయలిచ్చి పంపించండి" ఆజ్ఞాపించాడు దొరగారు తన ఔదార్యానికి తనే ఉప్పొంగిపోయి వుంటాడు.

"బస్సు చార్జీకైనా" అని అన్నాడో అందామనుకున్నాడో కాని మేనేజరు పురోహితున్ని బయటకి తోలుకొని వచ్చాడు

బస్సులో కూర్చుని వెనుకకు ఒరిగి ఆలోచిస్తున్నాడు పురోహితుడు. పెళ్ళానికి చీర కొనలేదు. కొడుక్కు పుస్తకము కొనలేదు. చిన్న కూతురుకు రిబ్బన్లుకాని, పెద్ద కూతురుకు పెద్దదానిమ్మకాయలుగాని కొనలేదు.

అయినా పురోహితునికి విచారం కలుగలేదు. నవ్వు వచ్చింది. వేలు ఖర్చుపెట్టి అమర్చిన విద్యుద్దీపాల మధ్య వేల రూపాయల బాండు మేళం మ్రోగుతుండగా, అయిదు వేల రూపాయల వివాహ వేదికపైన లక్షల రూపాయల వధూవరుల పెళ్ళి చేయడానికి ఈ పది రూపాయల పురోహితుడు లేకపోతే యేమవుతుంది? లక్షలు ఖర్చుపెట్టి యేర్పాటుచేసిన ఈ పెళ్ళి ఆగిపోతుందా? అర్థంలేని ప్రశ్న.

అయినా దొరవారి ఔదార్యానికి సంతోషమే కలిగింది. తన తిరుగు ప్రయాణానికి పదిరూపాయ లిచ్చాడు దొర. ●


## అరబ్ దేశాలలో ఉద్యోగం

నిశ్చితమైన పద్ధతి, ప్రభుత్వ నిబంధనలు మరియు ఖాళీలు తెలుసుకునే విధానం మీకు తెలిసినట్లయితే గల్ఫ్ దేశాలలో నేరుగా ఉద్యోగంను మీరు పొందవచ్చు స్త్రీలు / పురుషులకు స్కిల్డ్, సెమి స్కిల్డ్ మరియు అన్‌స్కిల్డ్ పనివార్లగా నెలకు మూడునుంచి పన్నెండు వేల రూపాయలవరకు జీతంపై ఉద్యోగావకాశాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇటీవల చాలామంది నేరుగా ఉద్యోగాలు పొందారు. పూర్తి సమాచారం మరియు 800 విదేశీసంస్థల యొక్క చిరునామాలు మరియు 100 మంది రిక్రూటింగ్ ఏజెంట్ల చిరునామాలు గల గైడు కొరకు ఇంగ్లీషు/హిందీలో మాత్రమే స్వంత చిరునామాగల కవరుతో మాకు వ్రాయండి.

GLOBE SERVICE INFORMATION CENTRE (REGD) (411)
WZ. H/24, New Mahabir Nagar. NEW DELHI-110 018.



## భారత దేశములో ప్రఖ్యాతిగాంచిన

5 సంవత్సరములు గ్యారంటి ఉండే మేరి 22 ct సూపర్ స్పెషల్ బంగారు కవరింగు ఆభరణములను. 15 సం॥ల నుండి ఆలోచించి, మొట్ట మొదటిసారిగా తయారుచేసి భారత దేశము మొత్తము వి.పి.పి. ద్వారా పంపించే పెద్ద స్థాపనము. దీనికి కావలసిన వివరములకు ఈ దిగువ అడ్రసుకు ఉత్తరము వ్రాసిన కేటలాగు ఉచితముగా పంపబడును.




దీనిలో వుండే నంబరును, ధరను క్రమముగా ఉత్తరం ద్వారా వ్రాస్తే వి. పి. పి. ద్వారా ఉచితంగా పంపబడును మీ అడ్రసును శుభ్రంగా పిన్‌కోడ్‌తోను ఆంగ్లంలో వ్రాయవలయును. వి. పి. పి. చార్జి ఎగస్ట్రా అగును. ఏజంట్లు కావలయును : ఏజంట్లకు ప్రత్యేక సదుపాయములు కలవు. వివరములకు ఈ క్రింది అడ్రసుకు వ్రాయవలయును. అడ్రసు తప్పనిసరిగా ఆంగ్లములో వ్రాయవలయును,

'EST'D 1963'

**MERI GOLD COVERING WORKS**

No. 14, Ranganathan Street, Post Box No. 1405,
T. Nagar, MADRAS-600 017.